క్లుప్తంగా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



బేతంచెర్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ అశోక్‌తో కలిసి ముద్దవరం, రుద్రవరం, బుగ్గానిపల్లె, బేతంచెర్ల పట్టణానికి చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. ముఖ్యంగా నాటుసారా, మాట్కా, పేకాటకు దూరంగా ఉండాలన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న జాన్

డోన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం బాలింతలు, రోగులు, గర్భిణులు, వారి సహాయకులకు పాతపేటకు చెందిన శ్రీనివాస ఆచారి ఆర్థిక సహకారంతో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. స్థానిక ఆదరణ వృద్ధాశ్రమం నిర్వాహకుడు జాన్‌ప్రభాకర్ ఆధ్వర్యంలో రొట్టెలు, గుడ్లు, పప్పు పంపిణీ చేశారు.

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అబ్దుల్లాపురంలో సుబ్రమణ్యం స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేదపండితుడు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి కర్పూర హారతులు సమర్పించారు. గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

జలదుర్గం ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



నాగార్జున

ప్యాపిలి: జలదుర్గం ఎస్‌ఐగా పి.నాగార్జున ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. కర్నూలు వీఆర్‌లో ఉన్న ఆయన ఈ మేరకు విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ పని చేసిన విజయ్‌కుమార్ మాధవరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్‌ఐ నాగార్జున మాట్లాడుతూ.. జలదుర్గం పరిధిలో శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక చర్యలకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తల్లీ కొడుకుపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెకు చెందిన తల్లీ కొడుకుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ గోవిందునాయక్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన తలారి సుంకమ్మ తన తండ్రి బాగోగులు సరిగా చూసుకోవడం లేదని, బాగా చూడాలని అదే గ్రామంలో ఉండే వదిన గుత్తి ఓబుళమ్మను ప్రశ్నించింది. దీంతో ఆమెపై వదినతో పాటు ఆమె కుమారుడు సురేష్ దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తల్లీ, కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు జంధ్యాల పండుగ

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని గాయత్రి పీఠంలో బ్రాహ్మణులకు సోమవారం జంధ్యాల పండుగ (ఉపాకర్మ)ను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం సభ్యుడు కళ్లె శేషావలిశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం 5.30 గంటలకు డోన్ అర్చక పురోహితుల బ్రాహ్మణ సంఘం సభ్యుల ఆత్మీయ సమ్మేళనంతో పాటు ఉపాకర్మ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీవేద గాయత్రి బ్రాహ్మణ సంఘం, శతవాధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా సంప్రదాయ దుస్తులతో హాజరు కావాలని కోరారు.

బైక్‌కు నిప్పు.. కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన రామేశ్వర్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఉంచిన బైక్‌కు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆదివారం ఉదయం గమనించగా బైక్ పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు.

ప్రమాదాలకు బ్రేకులు పడేనా..?

- స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు
- కానరాని సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు

అవుకు: అవుకు మండల కేంద్రానికి ఒకవైపు మహా సిమెంట్ ఫ్యాక్టరీ, మరోవైపు రామ్‌కో, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలు, ఇంకోవైపు అవుకు మూడో టన్నెల్ ఉంది. దీంతో అవుకులో భారీ వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. పైగా గ్రామంలో జాతీయ రహదారి 544డి రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో వాహనాలు రయ్యి.. రయ్యిమంటూ అధిక వేగంతో వెళుతుంటాయి. అయితే అవుకు పరిధిలోని జాతీయ రహదారిలో స్పీడ్ బ్రేకర్లు, సూచికలు లేకపోవడంతో మలుపుల వద్ద, కూడళ్ల వద్ద వాహన చోదకులు వేగంగా వాహనాలు నడుపుతున్నారు. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఈ ప్రదేశాల్లో నిత్యం ప్రమాదాలే

బస్టాండ్ సమీపంలోని మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల గత ఏడాది ఫిబ్రవరి నెలలో అవుకు గ్రామానికి చెందిన ఓ యువకుడు బైక్‌పై వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడని మలుపు వద్ద ఉన్న దుకాణాదారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మదర్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కేబీఎస్ పాఠశాల, ఐటీఐ కళాశాలలతో పాటు దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఈ మలుపు దాటిన తరువాతే ఉన్నాయి. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు భయం భయంతో ఈ మలుపు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కోవెలకుంట్ల రహదారిలోని రాజా వీధి సెంటర్‌లో అన్ని రకాల దుకాణాలు ఉన్నాయి. ఇక్కడే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, ఎస్‌బీఐ ఏటీఎం, పోస్టాఫీస్, ప్రాథమిక ఆదర్శ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. ఈ రహదారి పూర్తి ఇరుకుగా ఉంది. ఇలాంటి రహదారిలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల వాహన చోదకులు అతివేగంతో వాహనాలను నడుపుతున్నారు. ఇక్కడ ఎన్నోసార్లు ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురై పలువురు గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే మార్కెట్ ఏరియాలోని మూడు రోడ్ల కూడలి, తేరువీధిలోని నాలుగు రోడ్ల కూడళ్లలో స్పీడు బ్రేకర్లు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బస్టాండ్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



మలుపు వద్ద వేగంగా వస్తున్న భారీ వాహనాలు

ఇటీవల జరిగిన కొన్ని రోడ్డు ప్రమాదాలు

- అవుకు ఎస్సీ కాలనీకి చెందిన మందా బాబు గత ఏడాది ఫిబ్రవరి 21వ తేదీ రాత్రి తేరువీధి నుంచి బస్టాండ్ వైపుకు బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో బనగానపల్లె వైపు నుంచి ట్రక్కు అతి వేగంతో వస్తూ బస్టాండ్ వద్ద ఉన్న మలుపు వద్ద యువకుడు వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. యువకుడి తలకు, రెండు చేతులకు బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే నెల 22వ తేదీ మృతి చెందాడు.
- గత వారంలో అవుకు రాజావీధిలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద మండపం వీధి నుంచి ఓ పెద్దాయన మోటర్ సైకిల్‌పై వస్తుండగా అదే సమయంలో ముస్లిం వీధి నుంచి ఓ బాలిక సైకిల్‌పై కూడలిలోకి వచ్చింది. అక్కడ ఎలాంటి స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో మోటర్ సైకిల్ వేగాన్ని అదుపు చేయలేక ఆ పెద్దాయన చిన్నారిని కాపాడబోయి కిందపడిపోయాడు. దీంతో ఆ పెద్దాయన స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.
- ఈ ఏడాది జూన్‌లో బస్టాండ్ సమీపంలోని మలుపు వద్ద మెట్టుపల్లె రహదారి నుంచి భార్యాభర్తలు మోటర్ సైకిల్‌పై బస్టాండ్‌కు వస్తున్నారు. మరోవైపు తాడిపత్రి రహదారి నుంచి ఓ యువకుడు బైక్‌పై వస్తూ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో భార్యభర్తలకు, ఆ యువకుడికి గాయాలు కావడంతో స్థానికులు పక్కనే ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.
- సెంటర్‌లోని కూడలి వద్ద గత నెల తేరు వీధి నుంచి కోవెలకుంట్ల రహదారి వైపు ఓ వ్యక్తి మోటర్ సైకిల్‌పై వెళుతుండగా మార్కెట్ వీధి నుంచి స్కార్పియో వాహనం రావడాన్ని గమనించి మోటర్ సైకిల్ వేగాన్ని అదుపు చేయబోయి కిందపడిపోయాడు. దీంతో అతనికి చిన్నపాటి గాయాలయ్యాయి. ఇవే కాక చాలా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.



స్పీడ్ బ్రేకర్ లేని కోవెలకుంట్ల మార్గంలోని నాలుగు రోడ్ల కూడలి

వాహనాలు అతివేగంగా వస్తున్నాయి



బస్టాండ్ సమీపంలోని మలుపు వద్ద వాహనాలు అతివేగంగా వస్తున్నాయి. ఇక్కడ నిత్యం విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు రాకపోకలు సాగిస్తున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు, సూచికలను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది.

–షేక్ మహబూబ్ బాషా, దుకాణదారుడు, అవుకు

నిత్యం ప్రమాదాలు



కోవెలకుంట్ల రహదారిలోని సెంటర్‌లో స్పీడ్ బ్రేకర్లు లేక నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. వేగంగా వస్తుండడం వల్ల వాహనాలను అదుపు చేయలేక ప్రమాదలు చోటుచేసుకుంటున్నాయి. ఎంతో మంది గాయపడిన ఘటనలు ఉన్నాయి. ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలంటే స్పీడ్ బ్రేకర్లు, సూచికలు ఏర్పాటు చేస్తేనే సాధ్యపడుతుంది.

–షేక్ ఈసూఫ్, టీదుకాణాదారుడు, అవుకు

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్ల పరిధిలో 9 గంటల విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో..

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట 7 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలో ఉన్న గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

ఉద్రిక్తతకు దారితీసిన ప్రేమ వివాహం

బేతంచెర్ల: ప్రేమ వివాహం గూటుపల్లె గ్రామంలో ఆదివారం ఉద్రిక్తతకు కారణమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, రాణమ్మ దంపతుల కుమారుడు మధు శేఖర్ అదే గ్రామానికి చెందిన యువతిని మూడేళ్ల క్రితం ఇంటి నుంచి తీసుకెళ్లి ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇన్నేళ్లు బయట ఉన్న దంపతులు వారం క్రితం గ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం మధుశేఖర్ ఇంటి వద్దకు వెళ్లి గొడవపడ్డారు. యువకుడి కుటుంబ సభ్యులపై దాడి చేశారు. యువతిని బలవంతంగా లాక్కెళ్లారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మధుశేఖర్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. పోలీసులు రంగ యువతిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇరు కుటుంబాలను పిలిపించి సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనిత భర్తతోనే ఉంటానని స్పష్టం చేసింది. ఇద్దరూ ఇష్టప్రకారమే వివాహం చేసుకున్నారని.. మేజర్లు కావడంతో వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని..వారి జోలికి వెళితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ డి.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఫుడ్ కోర్టు వేలం

నంద్యాల(అర్బన్): జిల్లాలోని కొత్తపల్లి మండలం సంగమేశ్వరంలోనున్న ఫుడ్ కోర్టు, పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో నిర్మాణంలోనున్న కట్టడాన్ని జిల్లా పర్యాటక శాఖ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముచ్చుమర్రిలోని కట్టడాన్ని ఈ నెల 22వ తేదీన, సంగమేశ్వరంలోని ఫుడ్ కోర్ట్‌ను ఈనెల 23వ తేదీన కలెక్టరేట్‌లోని పర్యాటక శాఖ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5వేలు దరావత్తును జిల్లా కలెక్టర్, చైర్మన్, జిల్లా పర్యాటక మండలి పేరు మీద చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు సెల్ 7995087089, 8297098022 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీశైలంలో భారీ వర్షం

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు గంటన్నర పాటు కుండపోత వర్షం కురువగా, ఆదివారం మధ్యాహ్నం అరగంట పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. క్షేత్ర వ్యాప్తంగా వివిధ సత్రాలు, కల్యాణ మండపాల్లో పెళ్లిళ్లు జరుగుతుండడంతో వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. పెళ్లి ఊరేగింపులకు వర్షం అడ్డంకిగా మారడంతో అర్ధాంతరంగా ఊరేగింపులు ఆపేసి పెళ్లి వారంతా కల్యాణ మండపాలకు చేరుకున్నారు. మల్లన్న దర్శనార్థ అనంతరం భక్తులు పార్కింగ్ చేసిన వాహనాల వద్దకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడ్డారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



కొవ్వొత్తుల ర్యాలీలో విద్యార్థి సంఘం నాయకులు



వైద్య విద్యార్థిని మృతికి సంతాపం తెలియజేస్తున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు

డోన్ టౌన్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వాస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆదివారం సీపీఎం నాయకులు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సీపీఎం కార్యాలయంలో మండల, పట్టణ కార్యదర్శులు కొయిలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా నాయకుడు చిన్నర హిమాన్ మాట్లాడుతూ.. హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకుని రావాలన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

డోన్ పాత బస్టాండ్ వద్దనున్న గాంధీ విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం ఎస్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు తెలుగు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. న్యాయవాది సుబ్బుయాదవ్, విద్యార్థి సంఘం నాయకులు శివన్న, వైష్ణవిహాస్పిటల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అమానుషం

డోన్: వైద్య విద్యార్థిపై హత్యాచారం వంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన శిక్షలు అమలు చేయాలని డోన్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అధ్యక్షతన వైద్య విద్యార్థి మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు దాసప్ప, గాలయ్య, కాల్వ సుబ్బరాయుడు, ఆంజనేయులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి నివాళి



నివాళులర్పిస్తున్న సీఐ, పోలీసులు

డోన్ టౌన్: స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. స్వాతంత్య్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యం(వర్ధంతి)అయిన రోజును పురస్కరించుకుని స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాటంలో గాంధీజీ అహింసా మార్గంలో పోరాడుతుంటే సుభాష్‌చంద్రబోస్ మాత్రం ఆయుధాలు చేతపట్టి బ్రిటీస్ పాలకులపై యుద్ధం చేశారన్నారు. ఆయన అదృశ్యం నేటికీ మిస్టరీగా మిగిలిందని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ, ఏఎస్‌ఐ శ్రీనివాసులు, ఎస్‌బీ హెచ్‌సీ నాగేంద్రరెడ్డి, పోలీసులు చాంద్‌బాషా, సుధాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ్ సంఘం నాయకులు

బనగానపల్లె రూరల్: సామాజిక విప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి గౌడ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..పాపన్న గౌడ్ రాజ్యాధికారం సాధించేందుకు బహుజనులందరిని ఏకతాటిపై తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. సాధారణ కుటుంబంలో పుట్టి తన సైన్యంతో జమీందార్, సుబేదార్లపై దాడి చేసి ఆ నగదును పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. గౌడ సంఘం మండల కార్యదర్శి విజయ్‌గౌడ్, నాయకులు రమణ, తిరుపాల్‌గౌడ్, నర్సయ్యగౌడ్, వల్లపు శ్రీనివాసులుగౌడ్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చెరువు తూము




కుంగిపోయిన చెరువు తూము గోడ,



చెరువు కట్టపై పెరిగిన కంపచెట్లు

కొలిమిగుండ్ల: నాయినపల్లె–కొలిమిగుండ్ల గ్రామాల మధ్యనున్న సద్దల వెంగన్న చెరువు తూము ప్రమాదకరంగా మారింది. కొద్ది రోజుల క్రితం తూము గోడ కుంగిపోయింది. పలు చోట్ల గోడ బీటలు వారాయి. 52 ఎకరాల్లో చెరువు విస్తరించింది. చెరువు పరిధిలో 280 ఎకరాల మేర ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో ఎగువన భారీ వర్షాలు కురిసిన సమయంలో చెరువుకు పెద్ద ఎత్తున వరదనీరు చేరుతుంటుంది. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో చెరువులో నీళ్లు స్వల్పంగా ఉన్నాయి. చెరువు కట్ట కూడా చాలా చోట్ల దెబ్బతిందని రైతులు పేర్కొన్నారు. కట్టపై నుంచి తూము వద్దకు చేరుకునేందుకు మార్గం లేకుండా కంపచెట్లతో నిండిపోయింది. అలుగుకు కూడా అక్కడక్కడ లీకేజీలు ఏర్పడడంతో నీళ్లున్న సమయంలో వృథాగా బయటకు పోతుంటాయి. చెరువులో నీళ్లు పుష్కలంగా ఉంటే కొలిమిగుండ్లతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో వ్యవసాయ బోర్లతో పాటు తాగునీటి సరఫరా అందించే బోర్లలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. వర్షాలు కురిసి వరద నీరు చెరువులోకి చేరితే తూము గోడ మరింత కుంగిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మైనర్ ఇరిగేషన్ అధికారులు స్పందించి తూముకు మరమ్మతులు చేపట్టి, కట్టపై ఉన్న కంపచెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

అంకిరెడ్డిపల్లెలో మినరల్ వాటర్ కరువాయె..



ప్రధాన రహదారిలో వృథాగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్



అల్ట్రాటెక్ వాటర్ ప్లాంట్‌ను వాడుకలోకి తీసుకొచ్చేందుకు చేస్తున్న ఏర్పాట్లు

- వృథాగా మూడు మినరల్ వాటర్ ప్లాంట్లు

కొలిమిగుండ్ల: మారుమూల గ్రామాల ప్రజలకు సైతం మినరల్ వాటర్ సౌకర్యం అందుతున్నాయి. మండల కేంద్రం కొలిమిగుండ్ల కంటే జనాభా, ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్న అంకిరెడ్డిపల్లెలో మాత్రం మినరల్ వాటర్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సుమారు 1,632 కుటుంబాలకు పైగానే నివాసం ఉంటున్నాయి. నాపరాతి గనులు ప్రధాన జీవనాధారం కావడంతో గనుల్లో పని చేసే కార్మికులు ఎక్కువగా ఉన్నారు. దాదాపు పదేళ్ల క్రితం ప్రాథమిక పాఠశాల సమీపంలో అల్ట్రాటెక్ సిమెంట్ ఆధ్వర్యంలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ నీటి సమస్యతో వృథాగా మారింది. 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే ప్రధాన రహదారిలో ఎస్సీ కాలనీలోకి చేరుకునే దారిలో వాటర్ ప్లాంట్ నిర్మించిన కొద్ది రోజులు మాత్రమే పని చేయడంతో అది కూడా నిరుపయోగంగా మారింది. అంతకంటే ముందు కాటసాని రామిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జీవిచెట్ల వద్ద నిర్మించిన మరొక వాటర్ ప్లాంట్ సైతం ఇదే పరిస్థితిలో ఉంది. గ్రామంలో ఉన్న మూడు వాటర్ ప్లాంట్‌లు పదేళ్ల నుంచి వృథాగా మారాయి. అనంతపురం జిల్లా బుగ్గ నుంచి వ్యాపారులు ప్రతి రోజు రెండు ఆటోల్లో మినరల్ వాటర్‌ను ట్యాంకర్లలో తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. బిందె రూ.10, క్యాను రూ.12 చొప్పున వెచ్చించి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అల్ట్రాటెక్ సిమెంట్ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను పునః ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈప్లాంట్ చుట్టు పక్కల కాలనీల వారికి మాత్రమే ఉపయోగపడనుంది. గ్రామంలో మూడు చోట్ల వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తే తప్ప మినరల్ వాటర్ సమస్య తీరదని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చదువుతో పేదరిక నిర్మూలన



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ వేల్ఫేర్ ఆఫీసర్ ముస్తక్ అహ్మద్

సంజామల: విద్యతో పేదరిక నిర్మూలన సాధ్యమని.. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా బీసీ వేల్ఫేర్ ఆఫీసర్ ముస్తక్ అహ్మద్ అన్నారు. సంజామల బీసీ హాస్టల్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చాలని సూచించారు. పేదరికంలో చదువుకుని ఎంతో మంది గొప్ప స్థానాల్లో ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను చదివిస్తున్నారని.. దాన్ని మనసులో ఉంచుకుని చదువుకోవాలన్నారు. హస్టల్‌లో మోనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీది విద్యార్థులకు అందాలని బీసీ హాస్టల్ సంక్షేమ అధికారి మునిరాజుకు సూచించారు.